# పిట్ట - పురుగు

నడిచి, నడిచి అలిసిపోయిన కదలని కాళ్ళని దేహంతోనే ముందుకు తోసుకుంటూ, "యింక నావాళ్లు కనిపించరు" అన్న నల్లని నిరాశ వీడిపోయి, తను కాపురం వుంటున్న చెట్టు, తనవాళ్ళు కనిపించగానే, కొండంత సంతోషంతో ముందు కాళ్ళతో మొహం తుడుచుకొని, సర్వేశ్వరుణ్ణి స్మరిస్తూ ఆకాశంలోకి చూసింది చీమ. ఆమె రెండు సున్నితమైన స్టీలు బంతులు అతి సున్నితమైన తీగతో కలిపి అతికినట్టుంది.

ఆ ఉదయం -

బాలభానుడు తన బంగారు చేతుల్తో ప్రపంచాన్ని కౌగలించుకున్న వేళ, తన పిల్లల్ని ఇల్లు వదలవద్దని బతిమాలి, తిండివేటకి బైల్దేరింది ఆ చీమ. బయలుదేరి అడవి అంతా నడిచింది. అడవిలో పంచదార డబ్బాలూ, బెల్లం దిమ్మలూ వుండవు. ఆఖరికి బియ్యంబస్తాలు కూడా వుండవు. అంచేత దొరకని తిండికోసం వెతుకుతూ, లేని దార్లలో నడుస్తూ, నేలకి బొట్టు బొట్టు కారుతున్న తేనె పట్టును ఆలస్యంగా అయినా చూడగానే ఎంతో సంతోషించింది ఆమె. "ఇంక నావాళ్లందర్నీ పిలుచుకొని రావడమే ఆలస్యం." అనుకున్న

ఆమె పిల్చుకోని రావడానికి అంత ఆలస్యం ఔతుం దనుకో లేదు. కొంతసేపయ్యేక "పిల్చుకురాగలనా అనంత రక్షకా" అన్న నిరాశకూడా పట్టుకుంది ఆమెను. ఎంచేతంటే ఆమె దారి తప్పిపోయింది. తనకున్న "పసి" తను తిరిగిన జాడ ల్లోనే సుళ్ళు తిప్పుతోంది ఆమెను. ఆలశ్యం ఔతున్న కొద్దీ సత్తువ తెచ్చుకొని, వున్న దాహంమరిచిపోయి పరిగెత్త నారంభించిన ఆమెకు, ఎన్నో గంటలు నడిచేక మళ్ళీ తేనెతుట్టనే చేరుకునేసరికి ఆకలి, దప్పి, బలం, ధైర్యం అన్నీ పోయి, ఎటు చూసినా ఆకలికి పొర్లే తన పిల్లలే కని పించేయి.

కనిపించని పిల్లల బాధ ఊహించుకుంటూ, ఆమె కోరలు బిగబట్టి నడుస్తూ, సర్వరక్షకుణ్ణి ఎముకల్లోంచి ప్రార్థిస్తూ చేసిన ప్రయత్నం ఫలించి - తన పుట్ట, చెట్టు కని పించి, తన పిల్లలంతా ఆకలిగానే వున్నా క్షేమంగానే వుండి తనకోసం యెదురు సూస్తుండడం చూసి-మొహం ముందు కాళ్లతో తుడుచుకొని, ఆకాశంలోకి అనంత రక్షకుడికోసం చూడగానే కనిపించేయి - మధ్యాన్నం లేత ఆకాశంలో గాజు ఆకుల్లా మెరుస్తున్న చెట్టు ఆకులు. ఆకులు, పువ్వు లులా కనిపిస్తున్న పిట్టల రెక్కలూను. ఇంకా పరీక్షగా చూస్తే ఒక పక్షి గూట్లోంచి దానిమ్మ మొగ్గల్లాంటి పక్షి పిల్లల ఎర్ర ముక్కులు కనిపించేయి. ముక్కులు ముడుచు కునే వున్నాయి. ఆ ముక్కుల అందంచూసి మురిసిపోతున్న చీమకి, తల్లిపక్షి మాంసంముక్క పట్టుకురావడం పిల్లలు ముక్కులు తెరచి అరచేవరకు కనిపించనేలేదు. గూటిద్వారం

దగ్గర వాలిన తల్లి నోట్లోని మాంసం ముక్కని చూసి ఆత్రంగా బయటకు వచ్చేయి పిల్లలు.

ఆ సుందరదృశ్యం చూసిన చీమ ఆ అందాన్ని భరించలేక కళ్ళు మూసుకుంది.

కాని కళ్ళు తెరచేసరికి ఆ చీమకి కనిపించినవి - ఒక నల్లటి తోలు స్తంభం, దానిచుట్టూ దట్టంగా యినుపతీగల్లా పెరిగిన వెంట్రుకలూను, సత్తువకోసం కళ్ళు టపటపా కొట్టుకొని మళ్ళీ చూసింది చీమ. ఇప్పుడు ఆమెకు కనిపించినవి రెండు తోలు స్తంబాలు. వాటిమీద ఒక పంచె, దాని మీద ఒక దేహం, తల, రెండు చేతులు. ఆ చేతుల్లో ఒక విల్లు.

పరిస్థితి ఒక్క క్షణంలో అర్థం అయిపోయింది ఆమెకు. ఆ తోలు స్తంభాలు ఒక వేటగాడి కాళ్ళు. అతను ఆ పక్షి కుటుంబానికి బాణం గురిపెట్టి వదలడానికి సిద్ధంగా వున్నాడు. క్షణం ఆగితే తల్లి, పిల్లలు సర్వనాశనం అయిపోతారు. తెలుచుకుంటే ఆ చీమ ఆ పక్షి కుటుంబాన్ని రక్షించగలదు. కాని.... కాని తను రక్షించిన ఆ శత్రుకుటుంబానికే కనిపించకుండా తనూ, తనపిల్లలూ బతకాలి.

"సర్వేశ్వరా! నీ లీలలు ఎవ్వరికీ అర్థంకావు. నువ్వు పులి-ఆవు, పాము-కప్ప, పిట్ట—పురుగు, గొప్ప-బీదా సృష్టించి ఒకేచోట పెట్టేవు. కాని ఒకరికి చేసిన ఉపకారం వృధా పోదు. పోనియ్యవ్" అనుకుంది చీమ.

ఇంతలో ఈశ్వరుడి ఆజ్ఞ అయింది, చీమ వేటగాడి కాలు వేటకుక్కలా కరిచింది. చీమ వేటగాణ్ణి కరవడం తల్లి

పక్షి చూస్తూనేవుంది. ఆ అరణ్యంలోనే గాలిని చీల్చుకుంటూ బాణం ఎగరడం వేటగాడు తన రెండో కాలితో చీమని తన్నడం - బాణాన్ని తప్పించుకొన్న పక్షి కుటుంబం చెట్టుకో పిట్టగా ఎగిరిపోవడం_కాని పూర్తిగా తప్పించుకోని చీమ కాలు విరిగి నేలకు పడడం వేటగాడు చీమని ముచ్చటగా మూడు బూతులు తిట్టడం జరిగిపోయేయి. విరిగిన కాలు పూర్తిగా రాలిపోయి, చీమ మళ్ళీ నడవగలిగేసరికి ఎన్నాళ్ళు పట్టిందో ఆమె సమంగా చెప్పలేదు. కాని ఆకాలం తన కుటుంబం ఆకలికి ఆహుతైపోవడానికి అతి కొంచెం మాత్రం తక్కువని దానికి తెలుసు.

అబ్బ వర్షం!

అయ్యో వరద !!

అమ్మో ప్రళయం !!!

ప్రపంచం అంతా జలమయం, ఆకాశంలోంచి చూస్తే ప్రపంచం అంతా గాజుముక్కలా వుంది. కొంచెం క్రింద నుంచి చూస్తే సుళ్లు తిరుగుతున్న నీటితో ఉడుకుతున్న గాజు పెనంలా వుంది.

ఆ వేళకి మనుషులు వండుకొని ఎన్నాళ్ళో అయింది. జంతువులు తిండి తిని చాలా రోజులే అయింది. ప్రపంచాన్ని తుడిచేస్తున్న నీటిలో ఈదలేని జంతువులు మొదటే మునిగి చచ్చేయి, ఈదగలిగినవి ఇంక ఈదలేక చచ్చేయి. అంత వరకు తన గూటి కొమ్మనే కరుచుకొని వున్న చీమని తల్లి పక్షి చూడలేదు. కాని ఆ చీమ కాళ్ళు పట్టుతప్పి నీటిలో

పడిపోవడం మాత్రం పక్షి చూసింది. ఆ ప్రదేశం అంతా అడివి అవడంవల్ల చెట్ల తాకిడికి నీటివేగం పూర్తిగా తగ్గి పోయింది.

నీటిలో పడ్డ చీమ ఆ తల్లి పక్షిని చూసి, తనను రక్షించమన్నట్లు-ఆ వరద అంతా దాని కన్నీరేనా అనిపించేంత ఏడిచింది. పక్షి వెంటనే తన గూట్లోని ఎండుటాకు చీమ దగ్గర పడేసింది. "చేసిన ఉపకారం ఊరికే పోనియ్యవు కదా దయా మయా!" అనుకుంటూ చీమ ఆకుని ఎక్కడం- నీరు సుడి తిరిగి ఆకు పక్షి గూటి కిందికి రావడం - పక్షి ముక్కుతో ఆకుని, చీమని తన గూట్లోకి లాక్కోవడం ఒక్క క్షణంలో జరిగి పోయేయి.

"నన్ను ఇలా రక్షించిన నీకు ఎలా కృతజ్ఞత తెలుపుకోను భగవాన్" అంది చీమ.

"ఆ మాటే నేనూ అందా మనుకుంటున్నాను" అంది తల్లి పక్షి.

ఆ తర్వాత పక్షి పిల్లలు "ఇలాంటివి మరో వందైనా ఇవాళ చాలవు" అనుకుంటూ చీమని పంచుకు తినేశాయి.

—o—